

# పెద్దచెరువుగట్టు

కావిలిపాటి విజయలక్ష్మి

అర్ధరాత్రి. చిట్ట చీకటి. ఊరంతా నిద్రపోతూంటె, ఊర కుక్కల అరుపులు నిశ్శబ్దాన్ని భంగపరుస్తున్నాయ్.

పెద్ది నాయుడి లోగిట్లో అంతా నిద్రపోతున్నారు. కాని పెద్ది నాయుడికి మాత్రం కునుకు రావటంలేదు. చెవి ఇరుకున ఉన్న చుట్ట తీసి నోట్లో పెట్టుకొని మొదలు కొరికి ఉమ్మాడు. చివర బుగ్గి నులిపాడు. అగ్గిపెట్టి కోసం పక్కంతా చేతితో తడిమాడు. దొరకలేదు. 'రంగా!' అని పిలువబోయి, చొక్కా పక్క జేబులో చెయ్యి దూర్చి ఊరుకున్నాడు.

అగ్గిపెట్టి జేబులో దొరికింది. చుట్ట వెలిగించాడు. చలి. వణుకు. దుప్పటి తలమీదినుంచి లాగి, నిండా కప్పుకున్నాడు.


అవతల నుంచి బొయ్యిన కుక్కల అరుపులు. "ఛీ! ఎదవ కుక్కలు నిద్ర పోనివ్వవు. ఈటిని పెద్ద సెరువుకి బలెయ్యాల" విసుక్కున్నాడు.

పెద్దినాయుడి వయస్సు తొంభై దాటింది. కనురెప్పలు నెరపి వాలాయి. దృష్టి సరిగా ఆనదు. ముందరి పళ్ళు నాలుగు, వెనుక దంతాలు రెండూ ఊడిపోయాయి. తల సన్నగా వణుకుతుంది. నడుం కాస్త వంగింది. కర్ర ఊతతో ఇల్లంతా తిరుగుతాడు. భార్య పోయింది. కొడుకులు, కూతుళ్ళు, మనుమలు. మనమల పిల్లలు. అతనిది కౌరవ సంపత్తి అంటా రందరూ.

వయస్సు జారి శక్తి తగ్గినా, పాశేర్లనూ, అందరి మీదా అజమాయిషీచేసి మందలిస్తాడు.

"ముసలాడు. మేం ఎలాపెత్తే ఈడికెందుకో? కాటికి కాళ్ళు చాచుకున్న ఓడు. రామా, క్రిష్ణా-అనుకోక." అని విసుక్కుంటారు చాటుగా.

పెద్ది నాయుడు వయస్సులో ఉన్నప్పుడు గొప్ప గ్రంథకర్త-అని నవ్వుకుంటారు, అతని గత జీవితం గురించి విన్నవారు. ఆ ఊర్లో మూడు వంతుల సాగు భూమి పెద్దినాయుడిదే. నాయుడితో



పెత్తనం వదలడు పెద్దినాయుడు కొడుకుల దగ్గర నుంచిమనమలనూ. సరితూగ గలిగిన రైతు ఆ చుట్టు పట్ల గ్రామాల్లో లేడు. అందుకే

పెద్ది నాయుడి కంత పేరు.

కొడుకులు, కోడళ్ళు, మన మల-అంతా గదుల్లో సర్దుకుంటె నడవలోకి చేరింది చాలా రోజుల క్రితమే పెద్ది నాయుడి పడక. అత నికి కొంచం దూరంలో రంగడు పడుకుంటాడు.

రంగడికి, భార్యా బిడ్డలూ ఉన్నారు. ఐనా, నాయుడిగారి ఇంటి కాపలా పడుకోవాల్సిందే. ఎప్పు డన్నా పది దాటాక ఆలశ్యంగా రాత్రి వస్తే, "ఏట్రా! వళ్ళు తిమ్మి రెక్కిందేటి? నీకు తలుపు తియ్య టానికి నేను కూకోవాలా?" అని గుడ్లెఱ్ఱ జేస్తాడు పెద్ది నాయుడు.

"నేదండి. మా ఆడది.... మా అమ్మి...." అని తడబడిపోతాడు రంగడు. "ఊఁతలుపేసి...తొంగో" అంటాడు నాయుడు విసుగ్గా.

చుట్ట అర్పి మంచం కోడుమీద ఉజ్జాయింపుగా పెట్టుకొని, ముసుగు దన్ని పడుకున్నాడు నాయుడు.

దీపం బుడ్డిని పురుగు ఆర్పే సింది. నాయుడు గురక పెడు తున్నాడు. పెట్టెలు ఈడ్చినట్లు, మంచాలు జరిపినట్లు నాయుడు గురక శబ్దం పెద్ద దవుతుంది.

"ఓ....ఓ....ఆ ...." రంగడు భయంగా అరిచాడు.

నాయుడు గురక ఆగిపోయింది. గింజుకుంటున్నట్లు మళ్ళీ అరి చాడు రంగడు.

చప్పున మంచంమీద కూర్చు న్నాడు నాయుడు.

"ఊఁ.... ఓఁ.... ఆఁ...." గొంతులో ఏదో గురగురలాడుతూ న్నట్లు అరుస్తున్నాడు రంగడు.

"ఏట్రా రంగా! నెగు నెగు." మంచం క్రింద ఉన్న పొడ వాటి కర్రతీసి ఆకర్రతో రంగడిపక్కలో పొడిచాడు నాయుడు.

ఇంకా భయంగా అరిచాడు రంగడు.

"ఏటీడూ!" అని నవ్వుకొని లేచి, రంగడి మంచం దగ్గరగా నెమ్మదిగా నడిచి, రంగడ్ని చేత్తో తట్టి. "నెగరా రంగా! ఏటా అరు పులు?" అన్నాడు నాయుడు.

కళ్ళు నులుముకుంటూ లేచి కూర్చుని "దెయ్యమండీ!" అన్నాడు రంగడు భయంగా.

"దెయ్యమా? దీపం బుడ్డి వెలి గించు. ఇదిగో అగ్గిపెట్టె." అని పక్క జేబులో ఉన్న అగ్గిపెట్టె తీసి ఆ చెయ్యి రంగడి ముందుకి చాపాడు నాయుడు.

"ఉండండి బాబు. మా సెడ్డ బయంగుంది. దాని సిగదరగ. గుండెలమీద కూకుని పీక నొక్కే సినాదండి. సేతులూ, కాళ్ళూ,

# దెయ్యం కథ

నోరూ, ఏదీ కదలనిచ్చింది కాదు. తలకాయ నా ఆదీనంలో ఉందండి, అది సాలా సేపయి ఊపుతున్నానండి. అంజనేయసామికి మనసులోనె దణ్ణం పెడతన్నానండి."

"దీపం వెలిగించరేస్" అతన్నింక చెప్ప నివ్వకుండా కసురుకున్నాడు నాయుడు.

వణికే చేత్తో అగ్గిపుల్ల గీసి దీపం వెలిగించి, "నా నెప్పుడన్నా భయమన్నానా నాయుడుగోరూ?" అన్నాడు రంగడు.

"నా నిద్దర సెడదీసినావు గదర. నీకు దెయ్యం పట్టడవేటి? నువ్వే దెయ్యం నాగున్నవు. తొంగో" అన్నాడు నాయుడు.

"నిజంగ పట్టిందండి. అందరు అంటూంటె నమ్మే వోణ్ణికాదుగాని, ఇయ్యాల తెలిసిందండి దానిసంగతి, పెద్ద సెరువుకి గడ్డి కెళ్ళనాను గదండి మద్దాన్నం...."

"చెస్. పెద్ద చెరువు గట్టు కాడి దెయ్యం నిన్నేటీసెయ్యదురా రంగ. తొంగో" అన్నాడు నాయుడు, నిదానంగా శూన్యంలోకి చూస్తూ.

"నన్నెందుకు ఏటీసెయ్యదు? దానికి నేను మేనత్త కొడుకునా? మేనమావ కొడుకునా? సుట్టాన్నా? నాను అక్కడే అనుమానించినానండి."

"నీ ముఖం. అది నిన్నేటీ సెయ్యదు. నాను చెబుతున్నాను. నిబ్బరంగ గుండెలమీద సెయ్యేసి తొంగో."

"తమరెప్పుడన్నా ఆదెయ్యాన్ని సూశారా బాబు! మీరా సెరువు కేసి ఎళ్తారు కాని, గట్టు కాడికి మాత్రం ఎల్లరంట, మీకు గొప్ప భయమంట. అందరనుకుంటారు. నిజమేనేటి బాబు?"

"ఏదో గట్టుకాడ గడ్డి పరకల

కోసం ఎల్తారు కాని. అక్కడ నాకేటిపన్నా?" నవ్వేశాడు నాయుడు.

"దెయ్యం ఉన్నది కదా బాబూ?"

"అదేటి సేస్తది? నిన్నేటీ సెయ్యదు."

"అలా అంటారేటి బాబు! ఇప్పుడు గుండెలమీద కూకున్నది అది కాదూ?"

"నీదంతా బెమ. అందరూ అనే మాటలువిని జడుసుకొని ఉంటావ్. అంతే. ఆ దెయ్యం నేదు, గెయ్యం నేదు. తొంగో...." నాయుడు ముఖం మీదికి దుప్పటి లాక్కున్నాడు.

'దెయ్యాలు లేవూ! తనది భ్రమా?' ఆలోచిస్తున్నాడు జరిగిన దాన్ని గురించి రంగడు.

* * *

చద్ది గంజి తాగి తాటాకుల బుంగ బుజాన తగిలించుకొని పెద్ద చెరువు గట్టు వైపు నడిచాడు రంగడు. చెరువులో నీరు లేది పోవటం వలన గడ్డి బలిసింది. గడ్డి కోసుకొని కొంతమంది ఊరువైపు వెళ్ళి పోతున్నారు. కొంతమంది ఇంకా గడ్డి కోసుకుంటున్నారు.

పొలాలకు నీరు వదిలే మదుం దగ్గర కూర్చుని గడ్డి కొయ్యటం ప్రారంభించాడు రంగడు.

"ఇదే గట్టు దగ్గర, ఈ మదుం మీదే మనిషిని బలివేశారని కథలు చెప్పుకుంటారు ఊరి జనం. ఆ మనిషి దెయ్యమైందని...."

ఆ విషయం స్ఫురించే సరికి. గుండెల్లో చిన్న భయంలాంటిది వచ్చింది రంగడికి.

కొడవలి గడ్డినికోస్తూన్న సవ్వడితో ఏవో అడుగుల చప్పుడు— మనిషి తనవైపు నడచివస్తూన్నట్లు.

గడ్డి కొయ్యటం ఆపి. చెవులు రిక్కించాడు. ఏ శబ్దమూ వినరా లేదు. మళ్ళీ గడ్డికొయ్యటం ప్రారంభించాడు. మళ్ళీ అడుగుల సవ్వడి!

గడ్డి కొయ్యటం ఆపి. మళ్ళీ అడుగుల శబ్దం కోసం చెవులు ఒగ్గాడు. కాని ఏ శబ్దమూ లేదు.

కోసిన గడ్డి బుంగలో కూరి. గడ్డి కొయ్యబోయే సరికి మళ్ళీ ఏదో శబ్దం.

అతని గుండె ధైర్యం సడలి పోసాగింది. లేచి నిల్చుని నలు దిక్కులా చూసాడు. తూము అవతల ఎవరో పశువుల కాపరి కుర్రాడు కనుపించాడు.

ఆ కుర్రాడు నడుస్తూంటేనే తనకలా వినిపించిందని సరిపెట్టుకొని. మళ్ళీ గబగబా గడ్డి కొయ్యటం ప్రారంభించాడు రంగడు.

ఈ సారి. ఘల్లున గాజుల శబ్దం!

అదిరి పోయాడు రంగడు. గబ గబా బుంగ నెత్తిన పెట్టుకొని, ఆ చెరువులోనే దూరంగా గడ్డి కోసుకుంటూన్న మనుషుల దగ్గర కెళ్ళి, తాను విన్న శబ్దం గురించి వారికి చెప్పాడు. కాని, తన వెనుక రెండు గజాల దూరంలో కూర్చుని గడ్డి కోసుకుంటూన్న, చేతినిండా గాజులున్న పద్నాలు గేళ్ళ పిల్లను, ఎత్తుగా పెరిగిన గడ్డి దుబ్బు చాటు రావటంతో గమనించ లేదు రంగడు.

వారంతా, ఆ గట్టు దగ్గర దెయ్యాన్ని ఎవరెవరు ఎన్నిసార్లు, ఏ ఏ రూపాలలో చూశారో, ఎటు వంటి శబ్దాలు విన్నారో చెప్పి, అక్కడ దెయ్యం ఉందని దృఢ పరిచారు.

రంగడు నీరుగారి పోయాడు. పిసరంత ధైర్యం కూడా లేద ప్పుడు అతనికి. అక్కడి మనుషుల తోనే ఊర్లోకి వచ్చాడు. పెద్ది నాయుడు గారి జర్సీ ఆవుకి గడ్డి వేస్తూ అనుకున్నాడు—'ఎప్పుడూ పెద్ద చెరువు గట్టుకి గడ్డికి వెళ్ళ కూడ'దని.

కాని, అందరూ అనుకునే ఆ దెయ్యం ఐన వ్యక్తి ఎవరో అతనికి తెలియదు. అతనికే కాదు, ఆ ఊర్లో ఇప్పుడున్న వారికి ఎవ రికీ తెలియదు, ఒక్క పెద్ది నాయుడికి తప్ప.

* * *

పెద్ద చెరువుకి గండి పడింది. ఇది కొత్తకాదు. ఇది మూడవసారి. చెరువు క్రింద పొలాలన్నీ మునిగి పోయి పంటలు నాశనమవుతు న్నాయి, పెద్ది నాయుడికి దిక్కూ తెన్నూ తోచటం లేదు. ప్రతిసారి గండి పూడుస్తున్నారు. ముఖ్యంగా ఆ చెరువు క్రింద సేద్యం చేసే రైతులు-అందులో పెద్ది నాయుడి భూములే ఎక్కువ, నష్టపోతూన్నదీ ఎక్కువ పెద్ద నాయుడే. చెరువు బలి కోరుతుందని కొందరు ఊరి పెద్దలంటే, కోళ్ళు, గొర్రెలూ కోయించాడు. ఐనా లాభం లేక పోయింది. ప్రభుత్వానికి తెలియ జేశాడు. 'చూస్తాం' అన్నారు.

కాని, కాలయాపనకు వీలులేదు. చెరువు గండి పూడ్చాలి, అది గట్టిగా, శాశ్వతంగా పూడ్చబడాలి. ఇటుపైన ఇలా తామంతా పంట నష్టపోకూడదు. ఇలా పెద్ది నాయుడు ఆలోచించే తరుణంలో పెద్ద బారిక నాగన్న అతని చెవిలో ఏదో ఊదాడు.

పెద్ది నాయుడు ఒళ్ళు ఝల్లు మంది. తల అడ్డంగా ఊపి "కుదర్దు" అన్నాడు.

అప్పటికి పెద్ది నాయుడి వయస్సు నలభై దాటింది. మంచి వ్యవహార కర్త అయ్యాడు. అటు రాజకీయాలు, ఇటు ఊర్లో లావాదేవీలూ, అన్నీ తెలిసి మాట్లాడ గలిగే దిట్ట అయ్యాడు.

"ఒస్. మీరు తల్చుకుంటే అదెంత పనండి? అది జరిగితే, అందరికీ మేలండి" అన్నాడు నాగన్న.

పెద్ది నాయుడు ఆలోచనలో పడ్డాడు. ఎక్కడో బంగళా పునాదులు కూలిపోతూంటే, ఏదో వంతెన నిలవక పోతే, నాగన్న చెప్పినది జరిపించారని విన్నాడు. కాని, ఇప్పుడు....? అతను కణతలు రుద్దుకుంటూ కనులు మూసుకున్నాడు.

"ఆడా-మొగా, ఏదన్నా ఫర్వా లేదండి. కాలొంకా, చెయ్యొంకా. గుడ్డి, సొట్టా ఉండకూడదంతే." మళ్ళీ అన్నాడు నాగన్న.

"బాబూ! నన్ను పొలంకాడి కెళ్ళమంటారేటి?" అంటూ వచ్చింది వాళ్ళున్న దగ్గరకు అప్పలమ్మ.

పాదం మొదలు తల వరకూ ఒకే సారి పరిశీలనగా చూశాడు పెద్ది నాయుడు అప్పలమ్మ వైపు. నుదుట బొట్టు లేదు కాని, సలక్షణంగా ఉంది అప్పలమ్మ. పచ్చని శరీరఛాయ, కనుముక్కు తీరు. పాతిక దాటని వయసూ. అంతే కాక మంచి గుణం. 'తక్కువ జాతిలో పుట్టినా, అగ్గిలాటిది అప్పలమ్మ' అని ప్రజలు మెచ్చుకునే అప్పలమ్మ-అతని సమస్య విడగొట్టింది.

"ఆఁ! ఎళ్ళు." అన్నాడు నాయుడు.

ఎనిమిదేళ్ళ కొడుకు చెయ్యి పట్టుకొని పెద్ది నాయుడి పొలం వైపు నడిచింది అప్పలమ్మ.

ధాన్యం గాలికిపోసి బస్తాల కెత్తించింది. బస్తాలు సాలలో పెట్టించింది. గడ్డి కుప్పలు వేయించింది.

రాత్రి మొదటి ఝాము దాటాక ఇంటికి చేరుకుంది అప్పలమ్మ.

ఉదయాన్నే నాయుడిగారి గొడ్ల సాల ఊడ్చి, పేడ పిడకలు పెట్టి, కసువు లూడ్చి, కల్లాపి జల్లి, ముగ్గులు పెట్టి, నాయుడిగారి భార్య పురమాయించిన ప్రతి పనీ చేసి, ఇంటికి వెళ్ళి చద్ది తిని గడ్డికి వెళ్ళేది అప్పలమ్మ.

అప్పలమ్మ మామగారు, అతని తండ్రి, అతని తండ్రి, తరతరాలుగా నాయుడి గారింట్లో పాలేర్లుగానే బ్రతికిపోయారు.

అప్పలమ్మ మొగుడు పెద్ది నాయుడి దగ్గర పాలేరుగా చేస్తూ పొలంలో పాము కరిచి పోయాడు. అప్పలమ్మ కుదిరింది నాయుడింట్లో పాచి పనులు, గొడ్ల చాకిరీ చెయ్యటానికి. లేకుంటే ఆమెకు భుక్తి గడవదు,

గడచిన నాలుగు తరాల్లో, నాయుడుగారి మొకాసా పెరిగింది. కాని, పాలేర్ల బ్రతుకులు మారలేదు. చెమటోడ్చి పండించే రైతుకి గిట్టేవి తినటానికి సరిపడా గింజలే. భూకామందుదే లాభం, భోగం.

పాలేర్లు చెమటోడ్చి నాయుడ్ని కామందుని చేశారు.

అప్పలమ్మ కొడుకు ఎనిమిదేళ్ళవాడు. వాడికి ఇప్పుడిప్పుడే గడ్డి తవ్వటం, పసువుల్ని విప్పటం లాటి పనులు నేర్పుతూంది అప్పలమ్మ.

"నాయుడుగోరు పెద్ద మన సున్న మనిషి, మనకి దేవుడి లాటోరు. ఆ బాబుకాడ పాలేరు పని సెయ్యాలంటే మంచిపనోడివి కావాలి, యవసాయప్పనులు నేర్చుకోవాలి" అంటుంది అప్పలమ్మ కొడుకుతో.

వాడు తల్లి చెప్పేమాటలు అర్థం చేసుకోలేక ఆమె ముఖంలోకి ఆశ్చర్యంగా చూస్తాడు.

"నాయుడుగోరు, నీకు మంచి లాగులూ, చొక్కాలూ, కుట్టిస్తారు. పెళ్ళిచేస్తారు. గంటకి గడ్డి బుంగ నిండి పోవాల" అంటుంది అప్పలమ్మ.

లాగులూ, చొక్కాలూ, అన్న మాట విని, సంతోషంగా తల ఊపి గబగబా గడ్డి తవ్వుతాడు వాడు.

అప్పలమ్మ దృష్టిలో తమ కుటుంబాన్ని అన్నం, బట్టా ఇచ్చి పోషించి ఆదుకునే దయామయుడూ, దేవుడూ పెద్దినాయుడు.

* * *

సాల ఊడ్చే అప్పలమ్మ వైపూ, దూడల పలుపులు విప్పే ఆమె కొడుకు వైపూ మార్చి మార్చి చూశాడు పెద్దినాయుడు.

"మీగులావోడికి ఓ సొక్కా, లాగూ కుట్టించండిబాబూ!" అంది నాయుణ్ణి గమనించిన అప్పలమ్మ.

"అమ్మతల్లి పండుగ వస్తుంది కదా! కుట్టిస్తాలే" అన్నాడు నాయుడు.

"చిత్తం. మరి మీరే పెంచాల అణ్ణి" అంది అప్పలమ్మ.

నవ్వాడు హుందాగా నాయుడు.

వారం రోజులు గడిచేసరికి అమ్మతల్లి పండగవచ్చింది. కొత్త చొక్కా, లాగూ తొడుక్కు నిమురిసి పోయాడు అప్పలమ్మ కొడుకు.

అవ్వాళ, ఆ తల్లీ కొడుకు తిన లేనన్ని అట్లూ, బూర్లూ ఇచ్చింది అప్పలమ్మకి నాయుడి పెళ్ళాం.

"నాయుడుగారు సల్లగాఉండాల కావి. మన కేటి లోటు?" అని కొడుకు తల నిమిరి తృప్తిగా నిట్టూర్చింది అప్పలమ్మ.

* * *

తెల్లవారురఝాము. కోడికూసే వేళ. "అప్పలమ్మా!" అంటూ తలుపు తట్టాడు నాయుడు.

తృళ్ళిపడి లేచి 'బాబుగారు మా ఇంటి కొచ్చారు! ఏటి అరిజంటో?' అని తత్తరపాటుతో తలుపు తీసింది అప్పలమ్మ.

"నువ్వు చిన్న పనిచెయ్యాల" అన్నాడు నాయుడు.

"సెలవియ్యండి, బాబు!" అంది అప్పలమ్మ.

"పెద్ద సెరువు గట్టుకాడ నా కొత్త చెప్పులు మరిచిపోయాను. తెల్లారి ఎలుగొస్తే గడ్డి కొచ్చే ఓళ్ళు ఎత్తుకుపోతారు, ఎళ్ళి పట్రా!" అన్నాడు నాయుడు.

మరేమీ ననగలేదు, ఆలోచించ లేదు అప్పలమ్మ. నాయుడి మాట అంటె అంతే. వెళ్ళటానికే సిద్ధమైంది. వెన్నెల పోయి చీకటి పరుచుకున్న వేళ. నక్కలరిచే వేళ, పెద్ద చెరువుకి వెళ్ళే తోవలో చిట్టడివి, తాను ఒక్కతే చెరువు గట్టుకు ప్రయాణమౌతూంది - అని బెదరలేదు అప్పలమ్మ.

"ఏ గట్టుకాడ బాబు. తూర్పు కేశా, పడమటికేశా?" అడిగింది.

"తూర్పుకేశే. మోదుగు తుప్పల దగ్గర నల్లబండ ఉంది చూడు, అక్కడ. మరేం భయం లేదులే. మనుషులు తిరుగుతారు. కోడికూసే వేళయింది." అన్నాడు నాయుడు.

"ఔను. తెల్లారిపోద్ది. ఎన్నెల కునికిపోయింది. మా కుర్రోణ్ణి చూడండి బాబూ! మరి ఎల్లండి" అని నాయుడికి చెప్పి, గబ గబా అడుగులేస్తూ ఊరు దాటింది అప్పలమ్మ.

దూరాన నక్కల అరుపులు. ఏవో పిట్టల కూతలు. మినహా అంతా నిశ్శబ్దం. తన అడుగుల నవ్వడి తనకు విన్పిస్తూంటే గబ గబా పెద్ద చెరువు తూర్పు గట్టు వైపు నడిచింది అప్పలమ్మ.

మోదుగ తుప్పలు, నల్లబండ, నాయుడిగారి కొత్త చెప్పులు. చెప్పులు వెతుకుతున్నాయి-అప్పలమ్మ కనులు.

ఏదో బలిష్టమైన చెయ్యి ఆమె భుజంమీద పడింది.

కెవ్వున అరిచింది అప్పలమ్మ. తలెత్తి చూసిన అప్పలమ్మ

కనులకు కండలుతిరిగిన నల్లని వ్యక్తులు ఇద్దరు రాక్షసుల్లా కనిపించారు.

భయంగా అరచి రోదిస్తూ, ముందుకు నడవబోయింది.

ఆమె అడుగులు ముందుకి పడలేదు మరి. తన నెటో ఈడ్చుకుపోతున్న వ్యక్తుల్ని వదలమని బ్రతిమలాడింది, ప్రార్థించింది, తిట్టింది, కరచింది, దీనంగా రోదించింది.

ఆమె రోదన అరణ్య రోదనే అయ్యింది.

తెగిన గట్టుకి అడ్డుగా ఆమెను తోసి, మీద మట్టిపోసి తొక్కారు- ఆ మానవరూప రాక్షసులు.

ఇంకా మనిషిలో మాసిపోని మూఢ విశ్వాసాన్ని పరిహసిస్తూ, తీతువు గట్టుచుట్టూ తిరుగుతూ అరిచింది.

ఒక మహత్కార్యాన్ని నిర్వర్తించినట్లుగా, ఆ కిరాతకులు ఊరి వైపు—నాయుడిగారి లోగిలి వైపు నడిచారు గర్వంగా.

ఉదయం నిద్రలేచి పక్కలో తల్లి కనపడక, నాయుడిగారి లోగిల్లోకి వెళ్ళి "అమ్మేది?" అని అడిగాడు-అప్పలమ్మకొడుకు రంగడు.

"మీ అమ్మ కొండకి కర్రలకెళ్ళింది. చల్దికూడు తిని గడ్డికిపో" అన్నాడు పెద్దినాయుడు.

అప్పలమ్మని పులి ఎత్తుకుపోయిందన్నారందరూ.

రంగనికి పెద్దినాయుడే దిక్కయ్యాడు.

తర్వాత పెద్ద చెరువు గండి తెగిపడి పొలాలు ముంచలేదు. 'నరబలి పడింది' అని నాగన్న నోరు జారాడు.

ఆ మర్నాటినుంచీ పెద్దచెరువు గట్టుదగ్గర దెయ్యముందని పుకారు పుట్టింది.

నాయుడు దణ్ణం పెట్టుకుంటాడు అప్పుడప్పుడు-"అప్పలమ్మ తల్లీ! మా కుటుంబం జోలికి రాకు తల్లీ!" అని ఎవరూ చూడకుండా, వినకుండా. అతను మాత్రం ఆ నాటినుంచి ఈనాటివరకూ పెద్ద చెరువు గట్టువైపు వెళ్ళలేదు. ఊళ్ళో వాళ్ళంతా 'వట్టి పిరికి నాయుడు' అనుకునేవారు చాటుగా. నిజంగానే ఆనాటినుంచి నాయుడు వట్టి 'పిరికి నాయుడై' పోయాడు. అందుకే తొంభై ఏళ్ళొచ్చాయి నాయుడికి. *


విజయం నవంబరు నెల నవలానుబంధం

"అన్నపూర్ణ"

విమలారామం రచన